క్లుప్తంగా

నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే



నిశ్చితార్థ వేడుకలో జెడ్పీ చైర్మన్ రామ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : మండలంలోని మాచనపల్లె గ్రామానికి చెందిన సర్పంచ్ కాసా సుదర్శన్‌రెడ్డి కుమార్తె ఉమామహేశ్వరి, నరేంద్రరెడ్డి నిశ్చితార్థం దువ్వూరులోని సీవీవీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, చాపాడు, దువ్వూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న పోరెడ్డి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : హనుమత్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డితో కలసి ఆయన గురువారం స్థానిక బుడ్డాయపల్లెలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు భక్తులకు 2వేల లడ్డులు, పానకం, వడపప్పు, వడలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లవరం వెంకటేశ్వర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ గోనా ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్‌పై అభిప్రాయ సేకరణ వాయిదా

ప్రొద్దుటూరు : కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి శుక్రవారం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, త్వరలో ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోండి

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామ సర్వేయర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అన్వేష్, మండల నాయకులు పోలయ్య గురువారం బద్వేలు ఆర్డీఓ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలకు సేవలందించడం లేదని తెలిపారు. భూమిని సర్వే చేసేందుకు ప్రభుత్వానికి చలానా చెల్లించినప్పటికీ కొలతలు వేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు వారు ఆరోపించారు. రైతు బోరు వేసుకున్న తర్వాత సర్వే రిపోర్టు సర్వేయర్ ఇవ్వాల్సి ఉందని, రైతుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని వారు ఆరోపించారు. గ్రామ సర్వేయర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలతో విద్యాభివృద్ధి



మాట్లాడుతున్న డీకే చదువుల బాబు

ప్రొద్దుటూరు కల్చరల్ : గ్రంథాలయాలు విద్యాభివృద్ధికి ఉపయోగపడుతాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు తెలిపారు. స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సముద్రాలని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. మెదడుకు మేత లాంటి ప్రశ్నలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. విద్యార్థులతో దేశ భక్తి గీతాలను పాడించారు. విద్యార్థులకు జిరాఫీ చెస్, క్యారంబోర్డులో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకులు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న సాయికుటీర్‌రోడ్డులో ముగ్గురు మట్కా నిర్వాహకులను త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను ఎస్ఐ హనుమంత్ గురువారం రాత్రి మీడియాకు తెలిపారు. సాయికుటీర్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ హనుమంత్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తికి చెందిన జి విశ్వనాథ్‌రెడ్డి, ప్రొద్దుటూరులోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన జె నరసింహులు, దేవాంగపేటకు చెందిన జి వీరయ్యలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 95 వేలు నగదుతో పాటు మట్కా స్లిప్పులు, పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంజనేయుడికి విశేష పూజలు



చాపాడు : పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : హనుమాన్ శోభాయాత్రలో భక్తులు



బి.కోడూరు: ఆంజనేయస్వామి, సువర్చలా దేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కానపల్లె గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి విశేష పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారికి పూజలు చేసి కాయకర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో వైభవంగా ఊరేగించారు. రాత్రి ఆలయంలో గ్రామ తాళాల భజన కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జై శ్రీరామ్ భక్త బృందం, దశమందం బ్రదర్స్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర దర్గా బజార్, సుందరాచార్యుల వీధి, గాంధీ రోడ్డు, బొల్లవరం ఆంజనేయ స్వామి ఆలయం, టీబీ రోడ్డు, మైదుకూరు రోడ్డు, రిలయన్స్ పెట్రోలు బంకు మీదుగా టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వరకు సాగింది. భక్తులు తమ ద్విచక్రవాహనాలకు హనుమంతుని చిత్రం గల కాషాయ జెండాలను కట్టుకుని జై శ్రీరామ్ అని నినాదాలు చేస్తూ శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. దశమందం బ్రదర్స్ ఆధ్వర్యంలో 500 కాషాయ జెండాలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున 500 మజ్జిగ ప్యాకెట్లు, దీక్షు ఫుడ్ కోర్ట్ వారు టీ పంపిణీ చేశారు. జై శ్రీరామ్ భక్త బృందం వ్యవస్థాపకుడు దశమందం బాబు, రాజశేఖర్, గో సంరక్షణ సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి, శివశక్తి సేవా సంస్థ నిర్వాహకుడు పుల్లారెడ్డి, వెంకటేష్, కాకుమాని హరీష్, సాయి మనోజ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

పట్టణంలోని పలు ఆలయాల్లో హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేసి భారీ గజమాలలతో, వెండి కవచాలతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, వడమాల అర్చన, సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లవరంలోని ఆంజనేయస్వామి, టూటౌన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

చాపాడులో ఘనంగా సీతారాముల కల్యాణం

చాపాడు: మండల వ్యాప్తంగా గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని విశ్వనాథపురం, చాపాడు, చియ్యపాడు, పల్లవోలు గ్రామాల్లోని వీరాంజనేయస్వామి దేవాలయాల్లో హనుజ్జయంతి వేడుకల సందర్భంగా వీరాంజనేయస్వామిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథపురం, చాపాడు వీరాంజనేయస్వామి దేవాలయాల వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రమైన చాపాడు సమీపంలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి పురస్కరించుకుని సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించారు.

నేడు బండలాగుడు పోటీలు

వీరాంజనేయస్వామి జయంతోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో శుక్రవారం ఓల్డు కేటగిరి ఎడ్లకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

దువ్వూరు : మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత దువ్వూరులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి ఆలయ పూజారి నరసింహాస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, ఆకుపూజ, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పసల చిన్నవీరయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఖాజీపేట : ఖాజీపేట మండలంలో గురువారం అంత్యంత వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలను స్థానిక ప్రజలు నిర్వహించారు. ఆంజనేయకొట్టాలులోని ఆంజనేయ స్వామి, తవ్వారిపల్లెలోని వీరాంజనేయస్వామి, సుంకేశుల గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆటపోటీలు నిర్వహించి గెలిచిన వారికి కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు.

మైదుకూరు : మైదుకూరులో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ మాధవ ఆంజనేయస్వామి ఆలయం, కొత్తపాలెంలోని వీరాంజనేయస్వామి ఆలయం, శ్రీనగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, పట్టణంలోని నంద్యాల రోడ్డులో కొత్తగా వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

బ్రహ్మంగారిమఠం : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం బి.మఠంలోని పంచముఖ ఆంజనేయ స్వామికి టీటీడీ ఆధ్వర్యంలో ధర్మపరిషత్ ప్రచారకులు, స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే బోడపాడులో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు బిజివేముల రామసుబ్బారెడ్డి, నాగిశెట్టిపల్లె సర్పంచ్ వాకమల్లు అనంతరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బి.మఠంలో చాపాటి సుబ్బారెడ్డి, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, చెన్నారెడ్డి, నాగయ్య, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పద్మావతి, ఈశ్వరమ్మ, పాల్గొన్నారు.

ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామి

రాజుపాళెం : హనుమజ్జయంతిని పురసస్కరించుకొని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో గురువారం సాయంత్రం ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఉదయం నుంచి శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు, వడమాల, అభిషేకాలను వేద పండితులు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ రెడ్డి దంపతులు, భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రాజుపాళెం: వెల్లాలలో ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



పోరుమామిళ్ల : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న విరజానందస్వామి



అట్లూరు : కొండూరులో వేదపండితులు నిర్వహిస్తున్న హోమంలో పాల్గొన్న మహిళలు



బద్వేలు అర్బన్ : హనుమాన్ జయంతి సందర్భంగా బైక్‌ర్యాలీ



కాశినాయన: పోటీలను ప్రారంభిస్తున్న విశ్వనాథరెడ్డి, సర్పంచ్ రాజానారాయణరెడ్డి



ప్రొద్దుటూరు కల్చరల్ : పాత మార్కెట్‌లో వెలసిన ఆంజనేయస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : సత్యనారాయణ స్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి



దువ్వూరు : ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



ఖాజీపేటలో వీరాంజనేయ స్వామి



ప్రొద్దుటూరు రూరల్ : ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



బద్వేలు అర్బన్ : ఫైర్ స్టేషన్ వెనుక భాగం లోని ఆలయంలో ప్రత్యేక అలంకరణ

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి



బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాయలసీమ సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ ఎస్పీ మహమూద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 31న ఉదయం 11 గంటలకు సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంగమేశ్వరం వద్ద జరిగే భారీ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు వలన రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ అలుగు వల్ల కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతోనే అలుగు నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. సిద్ధేశ్వరం అలుగు రాయలసీమ రైతులకు సంబంధించి ఆకాంక్ష అని, ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించాలని కోరారు. సిద్ధేశ్వరం అలుగు సాధన కోసం ఈనెల 31న జరిగే బహిరంగ సభకు ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్లుగా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ముందుకు సాగకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి అలుగు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, రాయలసీమ విద్యార్థి సంఘం కన్వీనర్ హరిత, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న యోగాంధ్ర-2025 కార్యక్రమంపై డివిజన్ స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని బద్వేలు ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో యోగాంధ్ర కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని, అది ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. ఆయా శాఖల పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి యోగా వలన కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, బద్వేలు, మైదుకూరు మున్సిపల్ కమిషనర్లు వి.వి.నరసింహారెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల ఏఓ ఆర్.వి.సాయిక్రిష్ణ, యోగా గురువు అమర్‌నాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో, స్కానింగ్ సెంటర్లో యజమానులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీఓ హోంలో పీఎస్‌పీఎన్‌డీటీ యాక్టుపై నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. స్కానింగ్ మిషన్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకుని స్కానింగ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులపై, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ సౌమ్య, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు

ప్రొద్దుటూరు : రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు గురువారం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన కాలువ అయిన కొత్తపల్లె కాలువలో ప్లొక్లైన్‌తో పూడికతీత పనులు జరుగుతున్నాయి. మోడంపల్లెలోని శేషాద్రి అపార్ట్‌మెంట్ వద్ద జరుగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ నిరసన



నేలపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా

ప్రొద్దుటూరు : మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా ఇస్లాం పురం మసీదులో గురువారం నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కమిటీకి అనుబంధంగా ఉన్న మసీదుల నుండి ఇద్దరు వ్యక్తులను ఎన్నుకోవాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఇస్లాం పురం మసీదుకు సంబంధించి కనీసం ఎన్నిక ప్రకటన (ఏలాన్) చేయకుండా తమ ఇళ్లల్లో కూర్చొని రెండు పేర్లను పంపారని తెలుసుకున్న ఆయిల్ మిల్ ఖాజా నిరసన వ్యక్తం చేశారు. ఎన్నిక పారదర్శకంగా జరిపి కమిటీ సభ్యులను ఎన్నుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

మాజీ సర్పంచ్ మృతి

ఖాజీపేట : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇరగంరెడ్డి వీరారెడ్డి భార్య పుల్లూరు మాజీ సర్పంచ్ లక్ష్మిదేవి (80) మృతి చెందారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం విషమించి గురువారం రహమత్ ఖాన్‌పల్లెలోని ఇంటి వద్దనే మృతి చెందారు. 2001 నుంచి 2006 వరకు పుల్లూరు సర్పంచ్‌గా లక్ష్మిదేవి పనిచేశారు. ఆమె మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి

చాపాడు : పల్లవోలు ఎంపీటీసీ నగర్తి సుందరమ్మ (70) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. పల్లవోలు గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులైన నగర్తి ప్రసాద్ తల్లి నగర్తి సుందరమ్మ చాపాడు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటిలో సుందరమ్మ గురువారం రాత్రి మృతి చెందారు. ఈమె మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విచారం వ్యక్తం చేశారు.

కేతు రచనల్లో సామాజిక పరిణామ క్రమం



కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీ ప్రియులు

మైదుకూరు : ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి రచనల్లో సామాజిక పరిణామ క్రమాన్ని చూడవచ్చని రచయిత, అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. గురువారం మైదుకూరులో ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో సాహితీ ప్రియులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ కథ నవలల్లో ఏ అంశాన్ని తీసుకున్నా వస్తువును దృష్టిలో పెట్టుకోవాలే తప్ప రచయితల దృష్టి కోణంలో చూడవద్దని కేతు పేర్కొన్నట్లు తెలిపారు. రాయలసీమ నేపథ్యాన్ని ఈ ప్రాంతంలోని బడుగు బలహీన వర్గాల వారి స్థితిగతుల్ని కేతు విశ్వనాథరెడ్డి తన రచనల్లో చిత్రీకరించారని వివరించారు. ఆధునిక సాహితీ లోకంలో యువ రచయితలకు ఆయన దీపధారని పేర్కొన్నారు. సభ అధ్యక్షుడు బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి కేతు తన రచనల ద్వారా కృషి చేశారని కొనియాడారు. రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి మాట్లాడుతూ కేతు సాహితీ రంగంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం యువ సాహితీ వేత్తలకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పొలిమేర ఓబన్న, సాహితీ ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

క్షమా గుణమే ఏసు నినాదం



చర్చి ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, నాయకులు

ఖాజీపేట : క్షమా గుణమే ఏసు నినాదమని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ రామగోవిందురెడ్డి అన్నారు. కూనవారిపల్లె దళితవాడలో నూతన చర్చి ప్రారంభోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. చర్చి ప్రారంబోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా రఘురామిరెడ్డి, రామగోవిందురెడ్డి పాల్గొన్నారు. చర్చి నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రూ. 50 వేలు ఆర్థిక సహాయంతో పాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ద్వారా రూ. 2లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందరర్భంగా మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌ను చర్చి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, కేసీకెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, కేసీకెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, రెడ్యం రామకృష్ణారెడ్డి, ఏటూరు మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, కొత్తపేట నాయకుడు సిద్దారెడ్డి, పేతూరు, రత్నస్వామి, ప్రసాద్, ప్రభాకర్, ప్రేమ్ కుమార్, అశోక్, దేవదానం పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లైట్‌పాళెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ప్రీ ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా గురువారం గర్భిణులకు అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రీ ఎక్లంప్సియా అనేది గర్భం దాల్చినప్పుడు వచ్చే ఒక సాధారణ సమస్య అని అన్నారు. ఇది అధిక రక్తపోటు, మూత్రంలో ప్రోటీన్ ఉండటం ద్వారా గుర్తిస్తారని చెప్పారు. ఇది గర్భధారణ సమయంలో లేదా ప్రసవం తర్వాత సంభవించవచ్చన్నారు. అధిక రక్తపోటు, మూత్రంలో ప్రొటీన్, తలనొప్పి, కంటి సమస్యలు, పొత్తి ప్రాంతంలో నొప్పి, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడం తదితర లక్షణాలు కనిపిస్తే ప్రీ ఎక్లంప్సియాగా భావించాలన్నారు. గర్భం దశను బట్టి దీనికి చికిత్స మారుతుంటుందని తెలిపారు. రక్తపోటును నియంత్రించడానికి మందులు వాడుతూ, గర్భం దాల్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని కలిగి ఉండాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రీ ఎక్లంప్సియా రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. అలాగే గర్భస్థ సమయంలో చిన్న సమస్య వచ్చినా వెంటనే ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌తో చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ శ్రీదేవి పాల్గొన్నారు.